ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

శనివారం 19 జూలై 2025

ఎస్సీ, ఎస్టీ పథకాల నిధులు
సద్వినియోగం కావాలి
● అవకతవకలు జరిగితే చర్యలు తప్పవ్
● అర్హులకు అందాలి: కలెక్టర్ మిశ్రా
8

బగరు హుకుం సమస్యలను
పరిష్కరించాలి
● పట్టాలతోపాటు రుణాలిచ్చి ఆదుకోవాలి
● డీఎస్ఎస్ డిమాండ్



పల్లకిలో ఊరేగుతున్న చాముండేశ్వరీదేవి, పాల్గొన్న భక్తులు

అపురూపం అమ్మ దర్శనం..!

● ఆషాఢమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు

● సింహవాహనంపై దర్శనమిచ్చిన మైసూరు చాముండేశ్వరి



నిమ్మకాయల అలంకరణలో బనశంకరీ దేవి

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం చివరి శుక్రవారం కావడంతో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మైసూరు చాముండేశ్వరి అమ్మవారి అమ్మవారు సింహవానంపై భక్తులకు దర్శనమిచ్చారు. శృంగేరి శారదామాత, సిగందూరు చౌడేశ్వరి దేవి, సవదత్తి రేణుకా ఎల్లమ్మ, బెంగళూరు బనశంకరి మాత ఆలయాలలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. చాముండేశ్వరి దేవి ఆలయంలో గురువారం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. చాముండేశ్వరిదేవి జయంతిని పురస్కరించుకుని అమ్మవారి పల్లకీ ఉత్సవం జరిగింది. మైసూరు రాజ సంస్థానం యువరాజు యదువీర్, ఆయన భార్య త్రిషికా కుమారి, రాజమాత ప్రమోదా దేవి, ఎమ్మెల్యే జీటీ దేవేగౌడలు రథం లాగారు. శుక్రవారం తెల్లవారుజామునుంచే భక్తుల సందడి ప్రారంభమైంది. మధ్యాహ్నమయ్యేసరికి చాముండి కొండలు భక్తసంద్రంగా మారింది. ఓవైపు వర్షం కురుస్తున్నా శృంగేరి శారదామాత ఆలయంలో ఉదయం నుంచే భక్తజనం తరలివచ్చారు. సవదత్తి రేణుకా ఎల్లమ్మ ఆలయానికి బెళగావి, బాగల్కోటెతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు. సిగందూరు చౌడేశ్వరి ఆలయానికి ప్రత్యేకంగా కేబుల్ బ్రిడ్జ్ ఏర్పాటుతో భక్తుల రాక పెరిగింది. బెంగళూరులోని బనశంకరి దేవి ఆలయంలోనూ వేలాదిమంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. కాగా భక్తులు సైతం నిమ్మకాయ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. విద్యారణ్యపురలోని కాళికాదుర్గా పరమేశ్వరి ఆలయంలోనూ భక్తుల సందడి నెలకొంది.





నిమ్మకాయల దీపాలతో భక్తులు



బనశంకరి ఆలయంలో..

ధర్మస్థళ వివాదంపై సిట్ సాధ్యం కాదు: సీఎం



బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళలో పలువురి మృతదేహాల కళేబరాలు ఉన్నట్లు ప్రచారం అవుతున్న తరుణంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేయడం సాధ్యం కాదని సీఎం సిద్దరామయ్య తెలిపారు. ఎవరో డిమాండ్ చేశారని సిట్ వేయలేమన్నారు. వివాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని ప్రస్తుతానికి సిట్ అవసరం లేదన్నారు. ధర్మస్థళ వివాదానికి సంబంధించి తమపై ఒత్తిడి లేదన్నారు. ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాలగౌడతోపాటు పలువురు సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ధర్మస్థళ గ్రామం అటవీప్రాంతంలో పలు శవాలను పూడ్చిపెట్టానని ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వాటిని పూడ్చిపెట్టింది తానేనంటూ అంగీకరించాడు. స్థానిక పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కేఐఏడీబీ భూస్వాధీనంపై నిరసన

● ఫ్రీడం పార్క్‌కు భారీగా తరలివచ్చిన రైతులు



ఫ్రీడం పార్కు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

7

ఆంగ్లం వైపు అడుగులు

● మళ్లీ తెరపైకి ఇంగ్లీష్ మీడియం చదువులు ● 4,134 పాఠశాలల్లో శ్రీకారం ● ఈ విద్యా సంవత్సరం నుంచి అమలుకు కసరత్తు




బసవేశ్వర నగర్‌లోని ప్రభుత్వ కన్నడ, ఇంగ్లిష్ మీడియం స్కూల్

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను ప్రాంతాలవారీగా ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. 2019 నుంచే రాష్ట్రంలో ఇంగ్లీష్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయితే మాతృభాషకు ఆటంకం కలుగుతుందనే కారణంతోపాటు కొవిడ్‌తో నాలుగేళ్లపాటు కొత్త ఆ ప్రస్తావనకు స్వస్తి పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమయ్యాక రెండేళ్లనుంచి వరుసగా ఇంగ్లిష్ మీడియం పాఠశాలల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. 2025లో సిద్దరామయ్య బడ్జెట్‌లో 4వేల ప్రభుత్వ పాఠశాలల్లో ద్విభాష విధానాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. వాటి ప్రకారం పాఠశాలల్లో లభ్యమయ్యే మౌలిక సదుపాయాలను పరిగణించి ఇంగ్లిష్‌మీడియం పాఠశాలలను ప్రారంభించదలిచారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కర్ణాటక పబ్లిక్‌స్కూల్ (కేపీఎస్), పీఎంశ్రీ పాఠశాలలను ఇంగ్లీష్ మీడియం పాఠశాలలుగా ఎంపిక చేసుకున్నారు. ప్రతి తాలూకాలో ఎక్కువమంది విద్యార్థులు అడ్మిషన్లు కల్గిన వాటిని పరిగణనలోకి తీసుకున్నారు. తొలుత 15 పాఠశాలల్లో ప్రారంభించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాలు లేకుండా తక్కువమంది విద్యార్థులు ఉంటే తాలూకాలోని అన్ని పాఠశాలలను ఇంగ్లిష్‌మీడియంగా పరిగణించదలిచారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయుల నియామకపు ప్రక్రియ కొనసాగుతోంది. ఉపాధ్యాయుల నియామకం పూర్తయ్యాక ఈ పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయులను నియమిస్తారు. ఎంపిక చేసిన పాఠశాలల ద్వారా ప్రభుత్వానికి ఎటువంటి అదనపు భారం పడదు. విద్యార్థులకు మాతృభాషతోపాటు ఇంగ్లిష్‌లో నైపుణ్యత పెంచేందుకు అనుకూలం కానుందని విద్యాశాఖ అభిప్రాయపడుతోంది. బడ్జెట్‌లో 4వేల పాఠశాలలను ఇంగ్లిషమీడియంగా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కానీ శివమొగ్గ ప్రాంతంలో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించేందుకు డిమాండ్ ఉన్నందున 134 పాఠశాలలను అదనంగా చేర్చారు.

● 2019-20 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో కన్నడ మీడియంతో పాటు వెయ్యి పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రారంభించారు. 2024-25లో 1792 పాఠశాలలను, 2025-26లో 208 పాఠశాలలను ఇంగ్లిష్ మీడియం వెసలుబాటు కల్పించారు. బడ్జెట్‌కు అనుగుణంగా 4,134 పాఠశాలలను ఇంగ్లీష్ మీడియంగా చేర్చారు. దీన్నిబట్టి ప్రస్తుత విద్యాసంవత్సరంలో 4,134 పాఠశాలలు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేశారు. ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు ప్రారంభించడం ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్యను నియంత్రించవచ్చునని విద్యాశాఖ భావిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రారంభించాక అడ్మిషన్లు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలకు ఆదరణ పెరుగుతోంది. ప్రాథమిక దశలోనే ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికభారమైనా ప్రైవేట్ పాఠశాలల్లోనే చదివించాలనే ఆలోచనలో మార్పు రానుంది. పైగా ప్రైవేట్ పాఠశాలల తరహాలోనే తమ పిల్లలు చదువుకుంటున్నారనే సంతృప్తి చెందుతారు. ప్రస్తుతం గ్రామాలనుంచి చదువుకోసమే సమీపంలో ఉండే హోబళి లేదా ఇతరత్రా పట్టణాలకు విద్యార్థులను పంపుతున్నారు. ఈ విధానం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను పెంచడం ద్వారా కొంతమార్పు సాధ్యమని విద్యాశాఖ భావిస్తోంది. 2025-26లో తొలి విడతలో 208 పాఠశాలలకు అనుమతులు దక్కగా, బడ్జెట్‌లో ప్రకటించిన 4వేలతోపాటు శివమొగ్గకు అదనంగా 134 పాఠశాలలు చేర్చారు.

● మాతృభాష కన్నడమీడియంలో చదివేలా ఆర్‌టీఈ చట్టం 29 (2) ఎఫ్ సెక్షన్ ప్రకారం సాధ్యమైనంత మేరకు అనే పదాన్ని వీడిన ప్రభుత్వం చట్టసవరణ చేసింది. తద్వారా మాతృభాషలో ప్రాథమిక విద్యకు ఉండే అభ్యంతరం నివారించినట్లయ్యింది. ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం లేనందున పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు చేరుస్తున్నామనే తల్లిదండ్రుల వాదనను పక్కన పెట్టినట్లయ్యింది. అయితే ప్రస్తుత కాలంలో ఇంగ్లీష్ భాష నేర్చుకోవడం అన్ని విధాలా అవసరమనేలా మార్పులు వచ్చిన తరుణంలో పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్చేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇంగ్లీష్ మీడియం తెరవడం ద్వారా రానున్న రోజుల్లో మార్పు సాధ్యం కానుంది.



ఏడాది	ఇంగ్లిష్‌మీడియం పాఠశాలలు
2019-20	1,000
2024-25	1,792
2025-26	4,342
మొత్తం	7,034

రవాణా శాఖ ఉద్యోగులకు షాక్..!

● ఆరు నెలలపాటు నిరసన చేపట్టకుండా ఎస్మా

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన చేపట్టాలని భావిస్తున్న తరుణంలోనే ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఎస్మా జారీ చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆరు నెలలపాటు 'ఎస్మా' జారీ చేయడంతో ఆర్టీసీ ఉద్యోగులు ఏడాది ముగిసేదాకా ఎలాంటి నిరసనలు చేసేందుకు వీలులేకుండా పోయింది. ఉద్యోగులు 38 నెలల నుంచి వేతనం పెంపు, కరువుభత్యం కోసం ఆందోళనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 5నుంచి రాష్ట్ర రవాణా కార్పొరేషన్ల జాయింట్ యాక్షన్ కమిటీ నిరవధిక నిరసన చేపడ్తామని ప్రకటించింది. జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్యులు అనంతసుబ్బారావు నేతృత్వంలో ఆందోళన చేయాలని నిర్ణయించారు. ఈమేరకు అనంతసుబ్బారావు నిరవధిక నిరసనకు సంబంధించి ముఖ్యమంత్రికి మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. ప్రభుత్వం ముందస్తుగానే ఎస్మాను జారీ చేసింది. ఒకసారి ఎస్మా జారీ అయితే ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు ఎటువంటి నిరసనలు చేసేందుకు వీలుండదు. నిబంధనలు ధిక్కరించి నిరసనలో పాల్గొంటే వేతనంతోపాటు పదోన్నతులు, కరువుభత్యం అన్నింటిపైనా వేటు పడే అవకాశం ఉంది.





'ఇంటింటికీ పోలీస్' ప్రారంభోత్సవంలో హోంమంత్రి పరమేశ్వర్, డీజీపీ సలీం తదితరులు

మీ ఇంటికే పోలీస్..!

● సమస్యలను తెలుసుకునేందుకు వినూత్న ప్రక్రియ

● ప్రారంభించిన హోంమంత్రి పరమేశ్వర్

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడడమే లక్ష్యంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సరికొత్తగా 'ఇంటింటికీ పోలీస్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్ తెలిపారు. నగరంలోని గోవిందరాజనగర్‌లో శుక్రవారం ఏర్పాటైన 'ఇంటింటికీ పోలీస్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డీజీపీ సలీం, ఎమ్మెల్యే ప్రియాకృష్ణ, బీబీఎంపీ కమిషనర్ మహేశ్వరరావ్, నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంఆ హోం మంత్రి మాట్లడుతూ ఇకపై పోలీసు అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల ఇళ్లను సందర్శించి ప్రజల సమస్యలు ఆలకిస్తారన్నారు. చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. సమాజంలో భయం లేని వాతావరణం కల్పించడంకోసం ప్రజలు, పోలీసుల మధ్య సమన్వయం అవసరమన్నారు. ఈ సందర్భంగా 'ఇంటింటికీ పోలీస్' కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేయాలని, సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ 1930కు, చిల్డ్రన్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ బీట్ వ్యవస్థను విభజించామని, ప్రతి క్లస్టర్‌కు ఓ పోలీస్ సిబ్బందిని ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారన్నారు. స్థానిక ఇంటిని సందర్శించి వారి సమస్యలు ఆలకించి స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.



ఇంటి తలుపునకు స్టిక్కర్ అతికిస్తున్న హోం మంత్రి

తీరంలో వాన హోరు

● నాలుగు జిల్లాల్లో రెడ్ అలర్ట్

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం కొనసాగుతోంది. బెంగళూరు పరిసర ప్రాంతాల్లో మేఘావృతంగా ఉండగా తీరప్రాంత జిల్లాల్లో వర్షం హోరెత్తిస్తోంది. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి, కొడగు జిల్లాల్లో ఈనెల 24 వరకు భారీ వర్షాల సూచన ప్రకటించారు. దీంతో నాలుగు జిల్లాల్లోనూ శుక్రవారం రెడ్ అలర్ట్ ప్రకటించారు. మైసూరు, హాసన్, చిక్కమగళూరు, చామరాజనగర, శివమొగ్గ జిల్లాల్లో ఆరంజ్ అలర్ట్ ప్రకటించారు. బెంగళూరు, చిక్కబళ్లాపుర, కోలారు, మండ్య, రామనగర, కలబురగి, రాయచూరు, బీదర్, యాదగిరి జిల్లాల్లో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ, ముల్కి, కారావార, కోట, ఉడుపి, కార్కళ, భాగమంగల, కుందాపుర, మూడబిదరి, బెళ్తంగడి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ధర్మస్థళ, సిద్దాపుర, శృంగేరి, కుమట, గంగావతి, గుండ్లుపేట పరిసరాల్లో వర్షం కురిసింది. తుమకూరు, దావణగెరె, చిత్రదుర్గ, విజయపుర, కొప్పళతోపాటు కల్యాణ కర్ణాటక జిల్లాల్లో వర్షం కురవనుందన్నారు.

టోల్‌గేట్‌ల ఏర్పాటుపై ఎమ్మెల్యే నిరసన

రాయచూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాయచూరు-దేవదుర్గ రహదారిలో 40 కి.మీ పరిధిలో రెండు టోల్‌గేట్‌లు ఏర్పాటు చేయడాన్ని మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్న దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ తన నిరసనను వినూత్న రీతిలో తెలిపారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కేడీపీ సభలో సభకు అధ్యక్షత వహించిన మంత్రి వరణ ప్రకాశ్ పాటీల్‌ను టోల్‌గేట్‌ల వ్యవహారం పై ప్రశ్నించగా అందుకు మంత్రి సమాధానం చెప్పేలోగానే ఆమె ఆగ్రహానికి గురైయ్యారు. ఒక దశలో మంత్రి పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ఎమ్మెల్యే రెండు టోల్‌గేట్‌లను బంద్ చేయాలని డిమాండ్ చేయారు. కాగా ఆమె సభలో లేచి నేల పై కూర్చుని నిరసన తెలిపేందుకు సిద్ధమవుతుండగా తోటి ఎమ్మెల్యేలు, మంత్రి ఆమెను వారించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో మంత్రి జోక్యం చేసుకుని టోల్‌గేట్‌ల వసూళ్లను తాత్కాలికంగా నిలిపివేసేందుకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు.



కింద కూర్చుని నిరసనన తెలుపుతున్న ఎమ్మెల్యే

అదుపుతప్పి లారీ బోల్తా

● డ్రైవర్, క్లీనర్ దుర్మరణం

● కడప జిల్లా ముద్దనూరులో ప్రమాదం

● మృతులు బళ్లారివాసులు

ముద్దనూరు జూలై 18(ఆంధ్రజ్యోతి): ఏపీలోని కడప జిల్లా ముద్దనూరు మండల పరిధి కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని గంగాదేవిపల్లె సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో బళ్లారి జిల్లాకు చెందిన లారీడ్రైవర్ కమల్‌సాహెబ్(64), క్లీనర్ ఫకృద్దీన్(45) ఇరువురు అక్కడిక్కడే మృతి చెందారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు వివరాలిలా... బళ్లారి నుంచి చెన్నైకి లారీలో ఇనుప పైపులను తీసుకొని వెళుతున్నారు. గంగాదేవిపల్లె సమీపంలోకి రాగానే లారీ అదుపు తప్పి చీనీ తోటలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. లారీడ్రైవర్ కమల్‌సాహెబ్, క్లీనర్ ఫకృద్దీన్ లారీలో ఇరుక్కుపోయి మృతి చెందారు. వెంటనే సీఐ దస్తగిరి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను అతికష్టం మీద బయటకు తీయించారు. లారీ ఓనర్ అమీర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



బోల్తాపడ్డ లారీ

కమల్ మృతదేహం

ఫకృద్దీన్ మృతదేహం

అమ్మా.. ఇక నీ కొడుకు లేడమ్మా..!

తల్లికి వీడియో కాల్.. లైవ్‌లో యువకుడి ఆత్మహత్య

వెళ్లి.. వస్తానని..
అమ్మకే చెప్తివా..
పిచ్చి కన్నా..
తల్లి చూస్తుండగానే
ఉరికి వేలాడితివా..
అమ్మ గుండె
ఎంతగా తల్లడిల్లిందో..
ఒక్కసారైనా ఆలోచిస్తివా..
తల్లి కన్నీళ్లకైనా..
నీ మనసు కరగకపోయెనా..
చేతులెత్తి వేడుకున్నా..
వినకపోతివా..
ఐ లవ్ యూ.. అమ్మా.. అంటూ..
పాణం తీసుకుంటావా..
ఇంతకన్నా..
శిక్ష ఏముంటుంది కన్నా..?


మల్లికార్జున (ఫైల్)



ఆత్మహత్య చేసుకునే సమయంలో వీడియో కాల్‌లో విలపిస్తున్న మల్లికార్జున

బుక్కరాయసముద్రం, జూలై18(ఆంధ్రజ్యో): 'అమ్మా.. ఐ యామ్ వెరీ సారీ.. ఇక నీ కొడుకు లేడమ్మా.. జాగ్రత్తగా ఉండు.. మళ్లీ వస్తాను.. చెల్లి మానస కడుపున పుడతాను. నాకోసం మీరు ఉండాలి. నాన్నకు చెప్పు.. ప్లీజ్ మా... ఐ మిస్ యూ మా... లవ్ యూ మా...' అంటూ తల్లికి వాట్సాప్ మెసేజ్ చేశాడు. ఆ తర్వాత వీడియో కాల్ చేసి, వద్దని వేడుకుంటున్నా.. కళ్ల నీళ్లు పెట్టుకుంటున్నా వినకుండా.. తల్లి చూస్తుండగానే ఉరేసుకుని, మరణించాడు. కొడుకు మరణాన్ని చూసి తల్లి కుప్పకూలిపోయింది. మండలంలోని బొమ్మలాటపల్లి వద్ద బ్రహ్మంగారి గుడి వెనుక గుట్టపై ఉన్న చెట్టుకు ఉరేసుకుని మల్లికార్జున(23) మరణించాడు. నార్పల మండల పులసనూతల గ్రామానికి చెందిన ఆదినారాయణ, మునీశ్వరి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మల్లికార్జున. ఇంటర్ వరకు చదివాడు. అనంతపురంలో కారు డ్రైవింగ్ నేర్చుకుంటుండేవాడు. తాను చనిపోతున్నానని శుక్రవారం తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపాడు. అనంతరం తల్లి మునీశ్వరికి వీడియో కాల్ చేసి లైవ్‌లోనే చెట్టుకు ఉరేసుకుని, చనిపోతున్నానన్నాడు. తల్లి మునీశ్వరి కన్నీరు మున్నీరుగా విలపించింది. 'చనిపోవద్దు.. నాన్నా..' అని ప్రాధేయపడినా వినకుండా ఉరేసుకున్నాడు. దీంతో మునీశ్వరి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. మల్లికార్జున చనిపోయాడు. వెంటనే కుటుంబీకులు.. నార్పల పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలోనే చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని అటుగా వెళ్తున్న వారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. నార్పల పోలీసుల సమాచారంతో మృతదేహం మల్లికార్జునదిగా గుర్తించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. దీనిపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అశోక్(ఫైల్)

గుంతకల్లు టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతకొత్త చెరువు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వై అశోక్(24) మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు తిలక్ నగర్‌లో నివాసముంటున్న వై.సుబ్బరాయుడు, రామాంజినమ్మ కూరగా యల మార్కెట్‌లో ఆకుకూరల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. వీరి కుమారుడు అశోక్ కూడా తల్లిదండ్రులకు వ్యాపారంలో చేదోడుగా ఉండేవాడు. శుక్రవారం ఉదయం తన స్నేహితుడైన లోకేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గుత్తికి వెళ్లాడు. తిరిగి గుంతకల్లుకు వస్తుండగా పాతకొత్తచెరువు గ్రామం వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి బైకు బోల్తా పడింది. దీంతో అశోక్ ఎగిరి రాయి మీద పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన లోకేష్‌ను చికిత్స గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బోరున విలపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై ఎలుగుబంటి దాడి


గాయపడిన భూతరాజు

గుడిబండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ రాయాపురం గ్రామ సమీపాన శుక్రవారం పొలంలో పనులు చేసుకుంటున్న యువకుడు భూతరాజుపై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భూతరాజు ఉదయం తమ పొలానికెళ్లాడు. అటవీ ప్రాంతం పక్కనే ఉన్న పొలంలో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసింది. తీవ్రంగా గాయపరచింది. భూతరాజు కూడా ప్రతిఘటించాడు. సమీప పొలాల్లోని రైతులు గట్టిగా కేకలు వేయడంతో ఎలుగుబంటి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. గాయపడ్డ భూతరాజును 108 వాహనంలో మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ బీట్ ఆఫీసర్ మహదేవప్ప గ్రామానికి చేరుకుని, భూతరాజు కుటుంబ సభ్యులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పొలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భూతరాజును మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరామర్శించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా తరగతులు మళ్లీ వాయిదా

అనంతపురం విద్య, జూలై18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు బోధించే టీచర్లకు నిర్వహించ తలపెట్టిన ప్రాథమిక భాష, గణిత నైపుణ్యాలు (ఎఫ్‌ఎల్‌ఎన్) శిక్షణాతరగతులు మళ్లీ వాయిదాపడ్డాయి. ఈనెల 21నుంచి 26వ తేదీ వరకు నిర్వహణకు సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లా అధికారులు 5 డివిజన్లలో నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. ఏం జరిగిందో తెలీదు కానీ, శిక్షణా తరగతులను మళ్లీ వాయిదావేస్తూ శుక్రవారం ఎస్పీడీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో శిక్షణాతరగతులు వాయిదా వేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ వెల్లడించారు. ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామన్నారు. ఈ వాయిదాను టీచర్లు గమనించాలని కోరారు. తొలుత పాఠశాలల ప్రారంభ సమయంలోనే శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అడ్మిషన్లు, బడిబయట పిల్లల సర్వే, మెగా పీటీఎం కార్యక్రమాల నిర్వహణ నేపథ్యంలో టీచర్ల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో అప్పట్లో శిక్షణను వాయిదా వేసుకున్నారు. ఈనెల 21నుంచి నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టినా.. మళ్లీ వాయిదా వేయడంతో ఉపాధ్యాయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

మార్కెట్‌కు 1018 టన్నుల చీనీ కాయలు

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 1018టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. అలాగే కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.10,500వేలు పలికినట్లు పేర్కొన్నారు.

ఎస్కేయూలో ఉద్యోగుల బదిలీ

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను వివిధ విభాగాలకు బదిలీ చేశారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు శుక్రవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, మినిమం స్కేల్ ఉద్యోగులు మొత్తం 16 మందికి స్థానచలనం కలిగింది.

తెగని పంచాయితీ..!

- బదిలీల గడువు ముగిసినా ఖరారు కాని ప్లేస్‌మెంట్స్
- రోజుకో జాబితాతో కలెక్టర్ ఆమోదానికి..
- అంతుబట్టని ముగింపు ప్రక్రియ



అనంతపురం న్యూటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో గ్రేడ్-5 కార్యదర్శి, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల గడువు ముగిసినా నేటికీ ప్లేస్‌మెంట్స్ ఖరారు కాలేదు. పంచాయతీ అధికారులు రోజుకో జాబితాను కలెక్టర్ ఆమోదానికి పంపుతుండటంతో నే పంచాయితీ ఏర్పడిందన్న ప్రచారం జరుగుతోంది. అధికారులు చేసిన తప్పిదాలకు ప్రజా ప్రతినిధులతోపాటు కలెక్టర్ కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. గడువు ముగిసి 15 రోజులు గడుస్తున్నా బదిలీల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశాలు కల్పిస్తుండటం వెనుక ముడుపుల బేరం ఉన్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. బదిలీల గడువు ముగిసే నాటికే స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు అధికారులకు అందాయి. అందుకు అనుగుణంగా, మార్పుల్లేని రీతిలో బదిలీల ప్రక్రియ ముగించి ఉంటే ఇన్ని రోజులు ఈ తంతు నడిచేది కాదు. బదిలీల కౌన్సెలింగ్‌ను ఇష్టారాజ్యంగా చేపట్టడంతో నే సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

అంతా గందరగోళం

ప్రారంభంలో స్పౌజ్, ఇతర మెడికల్ గ్రౌండ్స్ కింద వచ్చిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించకుండానే ఆప్షన్ ఫామ్స్ తీసుకొని పంపించేశారు. అనంతరం గందరగోళానికి తెరలేపారు. మిగిలిన వారితో సైతం రెక్వెస్ట్ ఫామ్స్ తీసుకొని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు చేసుకొనే ప్రయత్నం చేశారు. అయితే మంచి ర్యాంకు వచ్చిన అభ్యర్థులు అడ్డు తగిలి నిరసనకు దిగారు. ఇది కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో స్పందించిన ఆయన అధికారులను పిలిపించుకొని గట్టిగానే క్లాస్ పీకినట్లు సమాచారం. దీంతో ర్యాంకుల వారిగా తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించారు. సిఫార్సు లేఖలకు అవకాశం లేకుండా చేశారు. అయితే సిఫార్సులకు సంబంధించి స్థానిక నాయకుల నుంచి ఒత్తిళ్లు రావడంతో వాటికి అనుగుణంగా బదిలీల ప్రక్రియను సరిదిద్దారు. ఇది సమస్యగా మారింది. దీనికి తోడు సిఫార్సు లేఖలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఆలస్యం కావడంతో మరింతమంది లేఖలు పట్టుకొచ్చారు. ఆఖరికి సిఫార్సు లేఖలు తెచ్చుకొన్న వారికి మాత్రం ఉన్న ఖాళీలకు అనుగుణంగా బదిలీలు చేసి మమా అనిపించారు. సిఫార్సు లేకుండా తమకు ఉన్న సమస్యలను చెప్పుకొని ప్రాధేయపడ్డ వారికి న్యాయం చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. యాడికి మండలంలో పని చేసేవారిని బొమ్మనహాళ్ మండలానికి బదిలీ చేశారు. అక్కడ మ్యూచువల్ ఉన్నారని కుటుంబసభ్యుల ఆరోగ్య పరిస్థితి బాగాలేదదని, తగిన న్యాయం చేయాలని వారం రోజులుగా అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేసినా కరుణించలేదు. ఇలా చాలా మంది బాధితులు గా మిగిలిపోయారు. అయితే బదిలీల ప్రక్రియ ఎప్పటికి ముగిస్తారన్నది అంతుబట్టకుండా ఉంది.

సీఎం సమీక్షలో ఎంపీ 'అంబికా'


పాల్గొన్న ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉండవల్లిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ లావు కృష్ణదేవరాయలు, ఎంపీలు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, కేంద్రం నుంచి ఏపీకి సాధించాల్సిన నిధులు, ప్రాజెక్టులు, ప్రజల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాల గురించి పార్లమెంట్‌లో తమ వాణి వినిపించేలా సీఎం దిశానిర్దేశం చేశారని ఎంపీ అంబికా తెలిపారు.

ఐదు రోజులు వానలు

బుక్కరాయసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34.5 నుంచి 35.7 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.2 నుంచి 25.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చని తెలిపారు. నైరుతి దిశగా గాలులు గంటకు 10కి.మీ. వేగంతో వీస్తాయని, గాలిలో తేమ ఉదయం పూట 73-78, మధ్యాహ్నం 46-52 శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతపురం జిల్లాలో 19వ తేదీ 40 మి.మీ., 20న 14 మి.మీ., 21న 10 మి.మీ., 22న 15 మి.మీ., 23న 12 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 19న 40 మి.మీ., 20న 14 మి.మీ., 21న 10 మి.మీ., 22న 15 మి.మీ., 23న 12మి.మీ. కురిసే అవకాశం ఉందని తెలిపారు.

రేపు ఇంటర్వ్యూలు

అనంతపురం అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీడాప్ ఆధ్వర్యంలో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎల్‌టీడీ సోలార్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగ నియామకాలకు ఈనెల 20వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 20న ఉదయం 8.30 గంటలకు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. నిరుద్యోగ యువకులు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. సీనియర్ మేనేజర్, మేనేజర్, ప్రాజెక్టు మేనేజర్, సీనియర్ ఇంజనీర్, ఇంజనీర్, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, ఫీల్డ్ ప్లానింగ్ ఆపరేటర్స్, లిజనింగ్ ఎక్విజిషన్, మెయింటెనెన్స్ ఓఅండ్ఎం పోస్టులకు బీటెక్, డిప్లొమా అన్ని బ్రాంచ్‌ల అభ్యర్థులు అర్హులన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు, రెన్యుబుల్ ఎనర్జీ, సోలా ర్ పరిశ్రమలో ఏడాదికిపైగా అనుభవం కలిగి ఉండాలన్నారు. అకౌంట్స్, హెచ్‌ఆర్ పోస్టుల కోసం ఎంబీఏ చేసిన ఏడాదికిపైగా అనుభవం ఉన్న వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 08554-271122, 8985091256 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు అరసం అభినందన సభ

అనంతపురం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ముగ్గురు పురస్కార గ్రహీతలకు ఏపీ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో అభినందన సభ ఆదివారం నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తన్నీరు నాగేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాకు చెందిన సీనియర్ సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రతిభా పురస్కారం, బండి నారాయణస్వామికి డాక్టర్ రావూరి భరద్వాజ స్మారక పురస్కారం, తూంచర్ల రాజారాంకు మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ వారి సాహిత్య విమర్శ పురస్కాలు ఒకే నెలలో ప్రకటించిన సందర్భంగా ఈ అభినందన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరసం అనంత అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

గూగూడు హుండీ ఆదాయం రూ.31లక్షలు

నార్పల, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు కుళ్లాయి స్వామి దేవాలయంలో శుక్రవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.31.3లక్షలు ఆదాయం వచ్చిందని ఈఓ శోభ తెలిపారు.

తిన్నది ఇచ్చేస్తాం.. ఎల్‌పీసీ ఇవ్వండి

- బతిమాలుతున్న బదిలీపై వెళ్లిన హెచ్ఎంలు
- కాంప్లెక్స్ నిధులు వెనక్కు ఇచ్చేందుకు తంటాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రకంపనలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం విద్య, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'బాబ్బాబు.. పొరపాటైంది. నేను డ్రా చేసుకున్న కాంప్లెక్స్ నిధులు తిరిగి ఇచ్చేస్తా. నాకు ఎల్‌పీసీ ఇవ్వండి' అంటూ బదిలీపై వెళ్లిన హెచ్ఎంలు బతిమలాడుతుండటం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మూడు రోజుల కిందట రెండే మీటింగ్‌లు.. రూ.లక్ష డ్రా చేసుకొని వెళ్లారు శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు సీరియస్‌గా స్పందించి, విచారణకు ఆదేశించారు. దీంతో డీఈఓ, ఎస్ఎస్ఏ ఏపీసీలు ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలతో కాన్ఫరెన్స్ నిర్వహించి 'మీరు పెట్టిన బిల్లులు పరిశీలన చేయిస్తామని, అందరూ అన్నీ సిద్ధంగా ఉంచు కోవాలి' అని ఆదేశించారు. దీంతో నిధులు డ్రా చేసుకొని బదిలీపై వెళ్లిన ఉన్నత పాఠశాలల హెచ్ఎంలలో ఆందోళన మొదలైంది. కొందరు హెచ్ఎంలు ఆ డబ్బును వెనక్కు ఇచ్చి ఎల్‌పీసీ తీసుకొని వెళ్లడానికి సిద్ధమయ్యారు. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఓకాంప్లెక్స్ హెచ్ఎం మరింత దిగొచ్చి తాను డ్రా చేసిన లక్ష రూపాయలు తిరిగిచ్చేస్తా.. ఎల్‌పీసీ ఇమ్మని రాయబారానికి దిగినట్లు సమాచారం. అయినా ఆ పాఠశాల కొత్త హెచ్ఎం 'మీరు ఏదో ఖర్చు పెట్టారని బిల్లులు పెట్టారు కదా సార్.. ఇపుడు ఆ లక్ష ఎలా ఇస్తారు? మీకు నష్టం కదా' అని ప్రశ్నిస్తే 'సార్ అదంతా వద్దు. ఇదిగో ఈస్కూల్ కాంప్లెక్స్‌కు వచ్చిన రూ.లక్ష ఇస్తున్నా తీసుకో. నాకెందుకు సమస్యలు. ఎల్‌పీసీ ఒక్కటి ఇస్తే చాలు నేను ప్రశాంతంగా వెళ్లి నా స్కూల్‌లో డ్యూటీ చేసుకుంటా' అని లక్ష రూపాయలు వెనక్కు ఇచ్చేశారట. బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, పుట్లూరు, గుత్తి, గంతకల్లు, రాయదుర్గం, బ్రహ్మసముద్రం, డి. హీరేహాళ్ మండలాల్లో వచ్చిన మొత్తం, ఖర్చుల వివరాలు అన్ని ఇచ్చి ఎల్‌పీసీ కోసం ప్రాధేయపడుతున్నట్లు సమాచారం. ఇంకొందరైతే తమ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల టీచర్లతో మీకు కాంప్లెక్స్ నిధులుతో ఫలానా టీఎల్ఎం మెటీరియల్ ఇచ్చామంటూ సంతకాలు పెట్టించుకొని వెళుతున్నారట. ఇలా కొందరు హెచ్ఎంలు కాంప్లెక్స్ గ్రాంట్స్ దోపిడీ నుంచి బయటపడటానికి నానా తంటాలు పడుతున్నారు.

- కాంప్లెక్స్‌లకు మళ్లీ నిధులు... నేడు తొలి సమావేశం

స్కూల్ కాంప్లెక్స్‌లకు ప్రభుత్వం మళ్లీ నిధులు విడుదల చేసింది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ నిధులు మంజూరు చేసింది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌కు రూ.28,700లు చొప్పన జిల్లాలో 135కాంప్లెక్స్‌లకు గాను రూ.38.74లక్షలు విడుదల చేశారు. ఈవిద్యా సంవత్సరంలో శనివారం ఈ 135కాంప్లెక్స్ స్కూళ్లలో తొలి సమావేశాలు జరగనున్నాయి.

యూరియా కోసం షరతులు

- ఎరువు కావాలంటే క్రిమిసంహారక మందులు కొనాల్సిందే
- దుకాణదారుల ఆగడాలతో అన్నదాతల అగచాట్లు

కణేకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): దుకాణదారుల షరతులతో హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు అల్లాడిపోతున్నారు. యూరియా కావాలంటే పురుగు మందులు కొనాల్సిందే అని చెబుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. మండలంలో ప్రతి ఏటా దాదాపు 22 వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేస్తుంటారు. వరి పైరు ఎదుగుదలకు యూరియా చాలా అవసరం. దీంతో ఎరువుల దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ ఒక్కో బస్తాపై అదనంగా రూ. 20 వసూలు చేస్తున్నారు. అలాగే అమ్ముడుపోని క్రిమిసంహారక మందులు అంటగడుతున్నారు. మందులు వద్దన్న రైతులకు యూరియా స్టాక్ లేదని బుకాయిస్తున్నారు. తప్పని పరిస్థితులలో రైతులు క్రిమి సంహారక మందులు కూడా కొనుగోలు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువుల దుకాణదారులు ఇలాగే వ్యవహరిస్తున్నారని చిన్న, సన్న కారు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు: ఏఓ జగదీష్

మండలంలో ఎవరైనా ఎరువుల దుకాణదారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, అవసరం లేకున్నా క్రిమిసంహారక మందులు అంటగడితే కఠిన చర్యలు తప్పవు. జూన్ నెల నుంచి ఇప్పటి వరకు మండలానికి 450 టన్నులు యూరియా సరఫరా అయ్యిందన్నారు. అందులో ప్రభుత్వ సొసైటీల ద్వారా ఆధార్‌కార్డ్ ప్రామాణికంగా ఒక్కో రైతుకు ఐదు బస్తాల వరకు యూరియాను అందిస్తామన్నారు. యూరియా కోసం రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.


యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు


బాత్రూంలో పెయింటింగ్ వేస్తున్న ఉద్యోగి

ఇవేం పనులు..!

- ఆర్టీసీ ఉద్యోగులతో బాత్రూంలో పెయింటింగ్ పనులు

ఉరవకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులతో బాత్రూంలో పనులు చేయించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఉన్న బాత్రూంలో ఉద్యోగులతో శుక్రవారం పెయింటింగ్ పనులు చేయించారు. అందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఉద్యోగులతో బాత్రూంలో పనులు చేయించడం బాధాకరమని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. డిపోలో పనిచేసే మెకానిక్, పెయింటర్, స్టోర్‌లో పనిచేసే ఉద్యోగులతో బాత్రూంలో పనులు చేయించారు. బయట వ్యక్తులతో శుభ్రం చేయించి, బిల్లులు పెట్టుకోవాల్సి ఉంది. ఆర్టీసీ అధికారులకు ఉద్యోగులు అంటే అలుసు అనీ, అందుకే ఇలాంటి పనులు చేయిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యులైన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై డిపో మేనేజర్ హంపన్నను అడగ్గా.. బాత్రూంల్లో పెయింటింగ్ చేయించామని అంగీకరించారు.

శభాశ్.. హరీశ్..!

- పాయింట్స్‌మన్‌కు డీఆర్ఎం అభినందన


హరీశ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదం విస్తరించకుండా చర్యలు తీసుకున్న పాయిట్స్‌మన్ హరీశ్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించారు. గుంతకల్లులోని రైల్వే డివిజనల్ కార్యాలయానికి రప్పించుకుని, శుక్రవారం ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. శాలువతో సన్మానించి, ప్రశంసాపత్రాన్ని, రివార్డును అందజేశారు. ఈ నెల 14న తిరుపతి స్టేషన్‌లో ఓ ఖాళీ బోగీలో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. దీన్ని గమనించిన పాయింట్స్‌మన్ హరీశ్, మంటలు వ్యాపించకుండా నిప్పంటుకున్న బోగీని ఇతర బోగీల నుంచి వేరుపరిచారు. రైల్వేకి ఆస్తి నష్టం జరక్కుండా సమయోచితంగా వ్యవహరించారు. ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ప్రాణాలకు తెగించి, ధైర్యసాహసాలను ప్రదర్శించారని డీఆర్ఎం అభినందించారు.

పెన్షనర్లు ఆర్థిక అవగాహన పెంచుకోవాలి: డీఆర్ఎం

గుంతకల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా రైల్వే ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా సూచించారు. డీఆర్ఎం కార్యాలయంలోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ అండ్ సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అనే అంశంపై శుక్రవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ డబ్బు వినియోగం విషయంగా డిజిటల్ లావాదేవాల ఆవశ్యకత పెరుగుతున్న కారణంగా రైల్వే ఉద్యోగులు, ముఖ్యంగా పెన్షనర్లు ఫైనాన్స్ ట్రాన్సాక్షన్ విషయంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. పెన్షనర్లు తమ ఫైనల్ సెటిల్మెంట్లను పోస్టాఫీసులోని పొదుపు పథకాల్లోనూ, సీనియర్ సిటిజన్ పొదుపు పథకం (ఎస్‌సీఎస్ఎస్)లో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో రైల్వే బ్రాంచ్ అధికారులు, ఎస్బీఐ ఫైనాన్స్, పర్సనల్ బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో గత నెలలో మరణించిన ముగ్గురు హోంగార్డులకు జిల్లా ఎస్పీ జగదీష్ శుక్రవారం డీపీఓలోని తన చాంబర్‌లో ఆర్థిక సాయం అందించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన హోంగార్డు తిరుపాల్ నాయక్ కుటుంబానికి హోంగార్డుల ఒక రోజు వేతనం నుంచీ రూ. 4.32లక్షలు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ. 10వేలు, నరసింహులు కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతపురం జిల్లాలో పనిచేస్తూ మరణించిన లక్ష్మిరెడ్డి కుటుంబానికి ఫ్లాగ్ ఫండ్ కింద రూ.10 వేల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పవన్ కుమార్, రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో పీ4, పీజీఆర్ఎస్, వసతి గృహాల తనిఖీ తదితర అంశాలపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు చేర్చాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి బాధ్యతగా పనిచేయాలన్నారు. బంగారు కుటుంబాల ఎంపికపై గ్రామసభలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని వసతి గృహాలను తరచూ తనిఖీ చేసి, విద్యార్థులకు సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించాలన్నారు. ఆర్డీవోలు కూడా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రజలనుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.


ఓపీఎస్‌తోనే న్యాయం

అనంతపురం విద్య, జూలై18(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానా(ఎపీఎస్)ను వర్తింపజేసి, న్యాయం చేయాలని 2003 డీఎస్సీ టీచర్లు డిమాండ్ చేశారు. ఓపీఎస్ అమలు కోరుతూ 2003 డీఎస్సీ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఫోరం నాయకుడు మధుప్రసాద్ మాట్లాడుతూ.. ఓపీఎస్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మెమో 57ను జారీ చేసిందన్నారు. దాదాపు 16 రాష్ట్రాల్లో ఆ మేరకు అమలు చేశారన్నారు. ఏపీలో కూడా అమలుచేయాలని కోరారు. రాష్ట్రంలో నూతన పెన్షన్ (సీపీఎస్) అమలుకు ముందే నోటిఫికేషన్ వచ్చిందన్నారు. నియామకాల పక్రియ వివిధ కారణాలతో అప్పట్లో ఆలస్యమైందన్నారు. సీపీఎస్ జీఓ వచ్చిన తర్వాత విధుల్లో చేరామంటూ తమకు పాత పెన్షన్ వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. ఓపీఎస్‌తో న్యాయం చేయాలని కోరారు. మధ్యాహ్నం వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనకు ఉపాధ్యాయసంఘాల నేతలు శ్రీనివాసనాయక్, పాపిరెడ్డి, సిరాజుద్దీన్, వెంకటేష్, రమణారెడ్డి, రామాంజనేయులు, వెంకటరత్నం, గోపాల్‌రెడ్డి, గోవిందు, లింగమయ్య, శివానందరెడ్డి, ఎర్రిస్వామి, అక్కులప్ప, పురుషోత్తంరెడ్డి, రవీంద్రనాయక్, శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. నిరసనలో 2003 డీఎస్సీ ఫోరం నాయకులు మారుతి, నాగభూషణ, ఎర్రిస్వామి, సాయినాథ్‌రెడ్డి, ప్రసన్నలక్ష్మి, వరదరాజులు, నాగేంద్ర, చంద్ర, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంయ్...

స్వామి విపులానంద (వర్ధంతి)



స్వామి విపులానంద 1892 మార్చి 27న శ్రీలంకలో జన్మించారు. విపులానంద అడిగల్‌గా పేరొందారు. తమిళ హిందూ సంఘసంస్కర్త, సాహితీవేత్త, రచయిత, కవి, ఉపాధ్యాయుడు. రామకృష్ణ మిషన్‌తో ఆయనకు ఎంతో అనుబంధం ఉంది. తమిళంతోపాటు సింహళ, సంస్కృతం, ఇంగ్లిష్, లాటిన్, గ్రీకు భాషలలో ఆయనకు ప్రావీణ్యం ఉంది. షేక్‌స్పియర్ రచించిన 12 నాటకాలను అనువాదం చేశారు. స్వామి వివేకానంద, రబీంద్రనాథ్ ఠాగూర్ తదితర ప్రముఖుల రచనలను ఆయన ఆంగ్లంలోకి అనువాదం చేశారు. సంగీతం, సంగీత పరికరాల అంశాలపై పరిశోధనలు చేశారు. శ్రీలంకలో ఎన్నో ఇన్‌స్టిట్యూషన్స్‌కు ఆయన పేరు పెట్టారు. 1947 జూలై 19న కన్నుమూశారు.

రాజేంద్రప్రసాద్ (పుట్టినరోజు)



రాజేంద్రప్రసాద్ 1956 జూలై 19న కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించారు. తెలుగు సినీనటుడు, నిర్మాత, సంగీత దర్శకుడు. 35ఏళ్ల కెరీర్‌లో 200కుపైగా సినిమాలలో నటించారు. ప్రధానంగా హాస్యపాత్రలో రాణించి 'నటకిరీటి'గా, హాస్య కిరీటిగా పేరొందారు. అహనా పెళ్ళంట, లేడీస్ టైలర్, ఎర్ర మందారం, పెళ్ళి పుస్తకం, మేడం, రాజేంద్రుడు - గజేంద్రుడు, ఆ నలుగురు వంటి సినిమాలు ఎంతో పేరు తెచ్చాయి. 'క్విక్ గన్ మురుగన్' ఆంగ్ల సినిమాకు ఐఐఎఫ్ఏ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో గుర్తింపు దక్కింది. 4 నంది అవార్డులు 3 సైమా అవార్డులు, 3 సంతోషం ఫిల్మ్ అవార్డులు ఇతరత్రా గౌరవాలు అందుకున్నారు. ఆంధ్రా యూనివర్శిటీచే గౌరవ డాక్టరేట్ పొందారు.

బెనడిక్ట్ కంబెర్‌బ్యాచ్ (పుట్టినరోజు)



'బ్రిటీష్ కల్చరల్ ఐకాన్'గా గుర్తింపు పొందిన ఆంగ్ల నటుడు బెనడిక్ట్ టిమోతి కార్ల్టన్ కంబెర్‌బ్యాచ్ 1976 జూలై 19న ఇంగ్లండ్ దేశంలోని హామర్‌స్మిత్‌లో జన్మించారు. ఎమ్మీ అవార్డు, బాఫ్టా, ఒలివర్ అవార్డుతోపాటు పలు పురస్కారాలు అందుకున్నారు. 2014లో టైమ్ మ్యాగజైన్‌లో ప్రపంచంలో వందమంది ప్రముఖుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. 2010-17 మధ్య బీబీసీ సిరీస్ 'షెర్లాక్ హోమ్స్'తో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఏవెంజర్స్ సిరీస్, స్పైడర్ మ్యాన్‌లలో సూపర్ హీరోగా నటించారు. మేడమ్ టస్సాడ్ మ్యూజియంలో ఆయన మైనపు విగ్రహం ఉంది.

మార్కెట్‌లోకి లగ్జరీ కార్లు



ఎంజీ సెలెక్ట్ షోరూం ప్రారంభం

బొమ్మనహళ్ళి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన లగ్జరీ కార్లను అందుబాటులోకి తెచ్చినట్టు ఎంజీ మోటార్స్ సంస్థ ఎండీ అనురాగ్ మహోత్రా తెలిపారు. ఎలక్ట్రానిక్‌సిటీలో షోరూం ప్రారంభం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ యూత్ ఇష్టపడే విధంగా కార్లను రూపొందించడమే కాక నేటి తరం అవసరాలను దృష్టిలో ఉంచుకుని కార్లు తీర్చుబడినట్టు తెలిపారు. బెంగళూరు సహా 13 నగరాలలో 14 షోరూంలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

చిన్నారులు వస్తువులు మింగితే... సొంతవైద్యం సరికాదు

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు వస్తువులు నోట్లో పెట్టుకునే అలవాటు ఉంటుందని, పొరపాటున ఏవైనా వస్తువులను మింగితే సొంతవైద్యం సరికాదని డాక్టర్లను సంప్రదించాలని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ రోహిత్ షైదూర్ అభిప్రాయపడ్డారు. ఈమేరకు శుక్రవారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాదిన్నర వయసున్న ఏ చిన్నారి పిన్నును మింగారన్నారు. చిన్నారికి వాంతి, జ్వరం లేదా ఇతరత్రా సమస్య రాలేదు. కానీ మలవిసర్జన చేయక పోవడంతో మెడికోవర్ ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. ఎక్స్‌రే ద్వారా గుర్తించి పీడియాట్రిషన్ అనురాగ్ మహాగాంవ్కర్, మోనికా గుప్త తదితరులు చికిత్సలు చేశారన్నారు. లోహపు వస్తువులు మింగినప్పుడు వాంతి కాలేదని వేచి ఉండడం, అరటిపండు తినడం ద్వారా మలవిసర్జన అవుతుందని భావించడం సరికాదన్నారు. ఇన్‌ఫెక్షన్ అయితే తీవ్ర సమస్య ఏర్పడుతుందన్నారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యం : మంత్రి



మాట్లాడుతున్న మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్

రాయచూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాయచూరు నగర స్వచ్ఛతకు అవసరమైన పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు రాయచూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్ అన్నారు. దేశంలోనే నెంబర్ 1 స్వచ్ఛ నగరంగా పేరు గాంచిన ఇండోర్ సిటీని సందర్శించేందుకు మహానగర పాలికకు చెందిన నలుగురు కార్మికులకు అవకాశం లభించింది. ఇందుకు సంబంధించి ఇండోర్ పర్యటనకు వెళుతున్న నలుగురు కార్మికులకు శుక్రవారం మంత్రి విమానం టికెట్‌లను అందజేశారు. ఇదే సమయంలో 20 మంది పౌరకార్మికులకు సంబంధించిన భీమా ప్రీమియం సొమ్మును మంత్రి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

కేఐఏడీబీ భూస్వాధీనంపై నిరసన



ఫ్రీడం పార్కు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

దొమ్మసంద్ర, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలో కేఐఏడీబీ భూస్వాధీనం చేసుకోవడాన్ని ఖండిస్తూ సర్జాపుర హోబళికి చెందిన గ్రామస్తులు శుక్రవారం భారీ నిరసన తెలిపారు. దొమ్మసంద్ర, కొమ్మసంద్ర, కాడ అగ్రహార, ఎస్ మేడహళ్ళి, తిమ్మసంద్ర, చిక్కనహళ్ళి, బీ హోసహళ్ళి, హందేనహళ్ళి, ముత్తనలూరు, చొక్కసంద్ర గ్రామాలకు చెందినవారు కొమ్మసంద్రలోని బైల బసవేశ్వర దేవస్థానం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. 1500మందికిపైగా రైతులు పాల్గొన్నారు. ఫ్రీడంపార్కుకు బయల్దేరే ముందు రైతు నాయకులు మాట్లాడుతూ సర్జాపుర హోబళిలో 2,450 ఎకరాలను భూమిని స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం ఆదేశించిందని దీన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టామన్నారు. బైలబసవేశ్వర దేవస్థానం నుంచి ముత్తనల్లూరు క్రాస్, ఇబ్బలూరు క్రాస్, సెయింట్‌జాన్స్ ఆసుపత్రి జంక్షన్, ఫ్రీడంపార్క్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. దేవనహళ్ళి తాలూకా చన్నరాయపట్టణ హోబళిలో కేఐఏడీబీ చేపట్టిన భూస్వాధీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ రైతుల నిరసనకు ప్రభుత్వం ఎట్టకేలకు దిగి వచ్చి ఉపసంహరించుకుందన్నారు. అదే రీతిన ఆనేకల్ తాలూకాలో ఫలవంతమైన సాగుభూములను కేఐఏడీబీ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిందన్నారు. తాలూకాలో పూలు, పండ్లు, చెరుకు, ద్రాక్ష, మిరప, రాగి, చిలగడదుంప, అనప, కొత్తిమీర తదితర రకాలు సాగు అవుతున్నాయన్నారు. ఇంతటి సాగుభూముల పట్ల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. అంతేకాక ఆనేకల్ తాలూకా వైవిధ్యమయమైందన్నారు. తాలూకాలో ప్రపంచంలో పేరొందిన ఐటీబీటీ సంస్థల సముదాయం ఉందన్నారు. ఇళ్లకు అవసరమైన గ్రానైట్, మార్బెల్, టైల్స్ వంటివి ఇక్కడ భారీగా లభిస్తాయన్నారు. మరోవైపు వన్యజీవులకు ఆశ్రయకేంద్రంగా ఉందన్నారు. పరిశ్రమలు పెరగడంతో రియల్‌మాఫియా దృష్టి తాలూకాపై పడిందన్నారు. అందుకే ఆకాశన్నంటిన భూములను కాజేసేలా పరోక్షంగా కేఐఏడీబీ పేరిట చౌకగా ఫలవంతమైన పొలాలను లాక్కునే కుట్ర పన్నిందని ఆరోపించారు. వివిధసంఘాల రైతుసంఘాల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

ఔషధమొక్కల పట్ల నిర్లక్ష్యం తగదు: ఎమ్మెల్యే



మొక్కలను పరిశీలిస్తున్న పర్యావరణవేత్త ఎల్లప్పరెడ్డి



మీడియాతో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్ళి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఔషధగుణాలు కలిగిన మొక్కల పట్ల నిర్లక్ష్యంగా క్రీడా మైదానంలో వదిలివేయడం తగదని పర్యావరణవేత్త ఎల్లప్పరెడ్డి అభిప్రాయపడ్డారు. హెచ్ఎస్ఆర్ లే అవుట్ వాజ్‌పేయ్ క్రీడామైదానంలో కాంగ్రెస్ నాయకులు 10వేల మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరోజు నామమాత్రంగా మొక్కలు నాటారు. వేలాది మొక్కలను అలాగే మైదానంలో వదిలేశారు. సమాచారం అందుకున్న పర్యావరణ వేత్త ఎల్లప్పరెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 10వేలమొక్కలు నాటుతామని గొప్పలు చెప్పారని, అయితే నామమాత్రంగా నాటి వదిలేశారన్నారు. వేలాది ఔషధ మొక్కలు విలువ లక్షల రూపాయల్లో ఉంటుందన్నారు. ప్రచారం గొప్పగా చేపట్టి మొక్కలను ఇలా వదిలేసిన కాంగ్రెస్ నాయకుల తీరును తప్పుబట్టారు. ప్రభుత్వ కార్యక్రమంగా చెప్పి ప్రైవేట్‌గా నిర్వహించారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి మంత్రి ఈశ్వర్‌ఖండ్రెకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇదే సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ విలువైన మొక్కలను అలా వదిలేయడం ఎంతవరకు సమంజసమని అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి చేసిన ప్రచారం చూస్తే పచ్చదనంకోసం చేపట్టిన కార్యక్రమంపై సంతోషపడ్డానని అయితే ఆచరణలో విఫలమైనట్టు తేలడంతో బాధ కలుగుతోందన్నారు. ప్రజాధనం వృథా చేయరాదన్నారు. వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా కాంగ్రెస్ పాలనలో బీడీఏ కాంప్లెక్స్ కూల్చివేయాలని నిర్ణయించారన్నారు. ఇందుకు సంబంధించి వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారన్నారు. ఈస్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్ర ఉందని ఆరోపించారు. స్థానికుల డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. అలాగే అంబేడ్కర్ సముదాయ భవనంకు కేటాయించిన స్థలంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు అక్రమ నిర్మాణాలు కడుతున్నారని ఆరోపించారు. దీనిపై స్థానికుల నిరసనతో కోర్టును ఆశ్రయించగా అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు అనుమతులు వచ్చాయన్నారు.

నవంబరులో అగరబత్తీ ఎక్స్‌పో



సన్నాహకసభలో అగరబత్తీ తయారీదారుల ప్రముఖులు

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా అగరబత్తీ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏఐఏఎంఏ) ఆధ్వర్యంలో దేశంలోనే అతిపెద్ద ప్రదర్శనలను నవంబరు 6నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ప్రదర్శనలకు సంబంధించి సన్నాహక సభలో భాగంగా శుక్రవారం ఏఐఏఎంఏ అధ్యక్షులు, అంబికా ఇండస్ట్రీస్ డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ అగరబత్తీ పరిశ్రమలో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయన్నారు. ఆధునికతకు అనుగుణంగా పరిశ్రమలో వస్తున్న విప్లవాలకు అనుగుణంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయదలిచామన్నారు. పరిశ్రమ ప్రగతికి ఎక్స్‌పో కొలబద్ధ కానుందన్నారు. సైకిల్ ప్యూర్ ఎండీ అర్జున్‌రంగా మాట్లాడుతూ దేశంలో అగరబత్తీ ఉత్పత్తి దారులందరినీ ఒకచోట చేర్చేలా ఎక్స్‌పో ఉంటుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇండోనేషియా నుంచి ప్రతినిధులు భాగస్వాములు అవుతారన్నారు. వేల కోట్ల రూపాయల వస్తువులు ఎక్స్‌పోర్ట్ కానుందన్నారు. అగరబత్తీకి ఉపయోగించే లావెండర్ ఆయిల్ ఇండోనేషియా నుంచి దిగుమతి అవుతుందన్నారు. ఓ ప్రశ్నకు సమాధానంగా అగర్బత్తీకి ఉపయోగించే వెదురు గడ్డిలాంటిదే గానీ కలప కాదన్నారు. పర్యావరణానికి అగర్బత్తీ పరిశ్రమ ఆటంకం కాదన్నారు. సమావేశంలో అమృత అరోమాటిక్స్ శరత్‌బాబు, బిజు సుగంధి డైరెక్టర్ సప్తగిరి ఎస్ బొగ్గరం తదితరులు పాల్గొన్నారు.

యూపీలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

▸▸ మంత్రి రాకేశ్ సచిన్



కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరప్రదేశ్ మంత్రి రాకేశ్ సచిన్ తదితరులు

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నామని ఆ రాష్ట్ర ఖాదీ గ్రామోద్యోగ్ జౌళిశాఖ మంత్రి రాకేశ్ సచిన్ వెల్లడించారు. సెప్టెంబరు 25 నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గ్రేటర్ నోయిడాలో జరిగే అంతర్జాతీయ వ్యాపార ప్రదర్శనకు సంబంధించి నగరంలో శుక్రవారం కాసియా ప్రాంగణంలో రోడ్‌షో నిర్వహించారు. పారిశ్రామికవేత్తలను వ్యాపార ప్రదర్శనకు ఆహ్వానించారు. పారిశ్రామికవేత్తల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఎలక్ట్రానిక్స్, చేతివృత్తులు, అగర్బత్తీ, ఫ్యాషన్, సుగంధద్రవ్యాలు వంటి విభాగాలలో 250మంది ఎగుమతిదారులు పాల్గొంటారన్నారు. యూపీలో 75 జిల్లాలు ఉన్నాయని, ఒక్కో జిల్లాకో ఒక్కో ఉత్పత్తి పేరిట బహుళ పారిశ్రామిక ఉత్పత్తులు సాధ్యం చేస్తున్నామన్నారు. ప్రదర్శనలో 2400 మంది ఎగ్జిబిటర్స్, 35వేలమంది సందర్శకులు పాల్గొంటారని అంచనా వేస్తున్నామని, 2వేల కోట్ల వ్యాపార లావాదేవీలు జరగవచ్చు నన్నారు. ఐఎంఎస్ ఫౌండేషన్ హెచ్‌వీఎస్ కృష్ణ, కాసియా అధ్యక్షులు బీఆర్ గణేశ్‌రావ్, ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షులు ఎంజీ బాలకృష్ణ, పీణ్యా పారిశ్రామిక వాడ చైర్మన్ దానప్పతోపాటు పలువురు పాల్గొన్నారు.

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజలో ఎంపీ డాక్టర్ కే సుధాకర్ తదితరులు

దొడ్డబళ్ళాపుర, జూలై 18(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వివిధ అభివృద్ధి పనులను ఎంపీల్యాడ్స్ నిధులకింద చిక్కబళ్ళాపుర ఎంపీ డాక్టర్ కే సుధాకర్ శంకుస్థాపన చేశారు. పట్టణంలోని వార్డు 15లో రంగప్ప సర్కిల్, 4వ వార్డులోని ఐబీ సర్కిల్‌లో కొత్త బస్టాప్, కొడిగేహళ్ళి, నాగసంద్ర గ్రామాలలో ప్రజల అనుకూలం కోసం హైమాస్ దీపాల అమరిక పనులకు శ్రీకారం చుట్టారు. దొడ్డబెళవంగల గ్రామంలో ఆర్‌సీసీ భవనంతోపాటు తాగునీటి శుద్ధీకరణ విభాగం, బస్టాప్ పనులకు భూమిపూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ బనవతి గ్రామంలో శుద్ధతాగునీటి విభాగం, బీడికెర గ్రామంలో బస్టాప్‌లను నిర్మించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కట్టుబడినట్టు తెలిపారు. అన్ని పథకాలను గడువులోగా పూర్తి చేస్తామన్నారు. కార్య క్రమంలో ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు, స్థానిక ప్రముఖులు, గ్రామపంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో స్వచ్ఛతపై జాగృతి

ముళబాగిలు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముళబాగిలు నగరసభ కమిషనర్ వీ శ్రీధర్ సూచన మేరకు పట్టణ వ్యాప్తంగా స్వచ్ఛతపై జాగృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎస్ హళ్ళి రోడ్డు, తదితర ప్రాంతాల్లో చెత్తా చెదారం ఇష్టం పడేయడంపై అధికారులు పలు సూచనలు చేశారు. ఇకపై అలా వేయరాదని వ్యాపారస్తులు, స్థానికులకు సూచించారు. అలా గుర్తించిన ప్రదేశాలను స్వచ్ఛ పరిచి రంగవల్లులు వేశారు. నిర్దిష్ట ప్రదేశాల్లో మాత్రమే చెత్త వేయాలని, స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలని అధికారులు సూచించారు. సీనియర్ ఆరోగ్య అధికారి వీ ప్రతిభ, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు డాక్టర్ వహీద్, నగరసభ స్వచ్ఛతా సిబ్బంది పాల్గొన్నారు.



రంగవల్లులు వేసి అవగాహన

కైవార కొండపై చాముండేశ్వరి జయంతి



గంగాభవాని అమ్మవారికి విశేష అలంకరణ

చింతామణి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కైవార కొండపై నెలవైన చాముండేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, గాజులసేవ, విశేష సేవల అనంతరం మహామంగళారతి ఇచ్చారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాల నడుమల కైవార పురవీధులలో ఊరేగించారు. విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గంగాభవాని ఆలయంలో

పట్టణంలోని శక్తిదేవత గంగాభవాని ఆలయంలో ఆషాఢమాసం శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. వివిధ రకాల చాక్లెట్లతో ఆకర్షణీయంగా అలంకరించారు. ప్రత్యేకపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రదర్శనలు, వ్యాపారాలకు కేంద్రంగా బెంగళూరు

▸▸ కేపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సౌమ్యరెడ్డి తదితరులు

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రదర్శనలు, వ్యాపారాలకు బెంగళూరు కేంద్రంగా కొనసాగుతోందని ఉయ్ వైశ్య సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన ప్రదర్శనలను కేపీసీసీ మహిళా అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఉయ్ వైశ్య సంస్థ వ్యవస్థాపకులు అనిల్ గుప్త పర్యవేక్షణలో ప్రదర్శనలు సాగాయి. ఫ్యాషన్, జ్యువెలరీ, ఆహారమేళా, అలంకరణ సామగ్రి ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్టు అనిల్‌గుప్త తెలిపారు. మెగా ఎక్స్‌పో నగర ప్రజల కోసం కుటుంబ సభ్యులతో కలసి వచ్చేలా అనుకూలం చేశామన్నారు. ప్యాలెస్ గ్రౌండ్స్‌లోని కింగ్స్ ప్రిన్సెస్‌లో 120 స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. సౌమ్యరెడ్డి మాట్లాడుతూ నగరంలో ప్రతిరోజూ ప్రదర్శనలు కొనసాగుతుంటాయన్నారు. భిన్నమైన వస్తువుల కొనుగోలుకు ఇదో మంచి అవకాశ మన్నారు. ఈనెల 20వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గణేశ్, కేఎస్ సంజయ్, సంతోష్‌శెట్టి, మూర్తి, ఉన్నతి సుప్రీత్, సంఘర్ష్, అభిజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పోలీస్‌పై గంగానగర్‌లో అవగాహన



సమస్యలు ఆలకిస్తున్న సీఐ చిత్తరంజన్

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇంటింటికీ పోలీస్ కార్యక్రమంపై శుక్రవారం ప్రజలలో అవగాహన కల్పించారు. ఆర్‌టీనగర్ పరిధిలోని గంగానగర్ బస్టాండ్‌లో ఇన్‌స్పెక్టర్ చిత్తరంజన్ ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇంటింటికీ పోలీస్ అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యలైనా నిర్భయంగా మీ ప్రాంతానికి వచ్చిన పోలీసులకు సమాచారం ఇవ్వవచ్చునన్నారు. ప్రతి ఇంటికీ పోలీసులు వస్తారని అప్పుడు మీ ప్రాంతంలో మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎస్సై యాసిన్ హవల్దార్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్యం అవసరం



బ్యాగులతో విద్యార్థులు తదితరులు

బంగారపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జీవితంలో విద్యతోపాటు నైపుణ్యం అవసరమని ఇందుకు ప్రతి విద్యార్థి ఎంతో శ్రమించాలని లెమెన్ సాఫ్ట్‌వేర్ హెచ్ఆర్ సుమా అభిప్రాయపడ్డారు. బూదికోటె హోబళి గుల్లహళ్ళి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్, నోటు పుస్తకాలు, రాతసామగ్రి అందచేశారు. ఉపాధ్యాయుడు రాఘవేంద్ర మాట్లాడుతూ తమ పాఠశాలకు కలర్‌ప్రింటర్ అవసరం ఉందని, ఒకవేళ ఏదైనా కలర్‌ప్రింట్ కావాలంటే 3 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం సంస్థ కూడా విద్యార్థుల సౌకర్యం కోసం కలర్‌ప్రింటర్ సమకూర్చిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లెమెన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రముఖులు శ్యామ్‌కుమార్, మేనేజర్ ప్రకాశ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు మునివెంకటప్ప, వెంకటేశప్ప పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

శిడ్లఘట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నేటి యువత పుస్తకపఠనంపై దృష్టి సారించడంతో సమాజంలోని మంచి చెడులపై అవగాహన పెంచుకుని మంచి బాటలో కొనసాగాలని ప్రిన్సిపాల్ శివమూర్తి అభిప్రాయపడ్డారు. సాదలి హోబళి లోని ప్రభుత్వ పీయూ కళాశాలలో ప్రథమ పీయూ తర గతులను ప్రారంభించి మాట్లాడారు. మనస్సు ఎన్నో ఆకర్షణలకు లోనవు తాయని అవన్నీ తాత్కాలికమేనని వాటి వెనుక పడకుండా జీవితానికి మంచి అంశాలతో లక్ష్యంగా ముందుకు సాగాల్సి ఉందన్నారు. కాలేజ్ లైఫ్‌లో విద్యతో పాటు మంచి స్నేహితులు, చక్కటి అలవాట్లతో ఉత్తమ జీవనానికి మార్గ దర్శకం చేసుకోవాలన్నారు. రిటైర్డు టీచర్ నాగరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. కళాశాల జీవితమే తదుపరి జీవనానికి నాంది అవుతుందన్నారు. అనంతరం ఆర్ట్స్, సైన్స్, కామర్స్‌లలో అత్యధిక మార్కులు సాధించినవారికి నగదు ప్రోత్సాహకాలు అందచేసి సత్క రించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు నంజప్ప, లెక్చరర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,611.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	38,779	49.522
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	38,523	212
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	39.72



అలంకరణలో బళ్లారి దుర్గామాత



హోసూరమ్మ

అమ్మవారికి ఆషాఢ శుక్రవార పూజలు

బళ్లారి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం చివరి శుక్రవారం అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. బళ్లారి కనకదుర్గమ్మ, హోసూరు వసూరమ్మ, ఉలిగి ఉలిగమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయం, ఏడుమక్కల తాయి ఆలయాల్లో 'అమ్మ' దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఉదయం అమ్మవారికి విశేష అలంకరణతో పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక హారతులు, అలంకరణలు చేపట్టారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప: ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డుమార్గంలో వెలసిన తాయమ్మదేవికి భక్తులు దర్శనం కోసం పోటెత్తారు. ప్రధాన అర్చకులు శ్రీనివాస, ప్రవీణ్ దేవికి పుష్పాలంకార సేవలు, ఆకులపూజ, మహామంగళహారతి చేశారు. భక్తులు ప్రసాద పంపిణీ చేపట్టారు.



ఉలిగమ్మదేవి



తాయమ్మదేవి

విద్యుత్ సరఫరాలో అంతరాయం

బళ్లారి గాంధీనగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నగర ఉప విభాగం పరిధిలో వచ్చే 220/11 కేవీ అల్లిపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బ్యాంక్-1 నుంచి విద్యుత్ సరఫరా అయ్యే ఫీడర్ నెం 75లో అత్యవసర పనులు నిర్వహిస్తున్న కారణంగా జూలై 20వ తేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు జెస్కాం అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కారణంగా ట్రామాకేర్ సెంటర్, గోపాల్‌గౌడ నగర్ 1వ ప్రధాన రోడ్డుతో పాటు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు, విద్యుత్ వినియోగ దారులు జెస్కాం శాఖతో సహకరించాలని కోరారు.

రేపు సీపీఎం నిరసన

హోస్పేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రియాంక జైన్, కవితా ఈశ్వర్ సింగ్, తదితరులపై సీబీఐ దర్యాప్తుకోరుతూ జూలై 20న ఎమ్మెల్యే గవియప్ప ఇంటి దగ్గర జరిగే సీపీఎం నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని దళిత హక్కుల కమిటీ పిలుపునిచ్చింది. హోస్పేటతాలూకా కమిటీ మద్దతు తెలుపుతున్న డీహెచ్ఎస తాలూకా అధ్యక్షుడు ధనరాజ్, నాయకులు బీ తాయప్పనాయక్, ఎస్ సత్యమూర్తి, బీ రమేష్‌కుమార్, మారడి జంబయ్యనాయక్ శుక్రవారం ఒక ప్రటకనలో మాట్లాడుతూ ప్రియాంక జైన్, కవితా ఈశ్వర్ సింగ్, తదితరులపై సీబీఐ దర్యాప్తు జరపాలన్నారు. అనేక సంవత్సరాలుగా బీజేపీ-కాంగ్రెస్‌తో సంబంధాలు కలిగి ఉన్నారు. ప్రియాంక మహిళా పట్టిన సహకారి సంఘ లిమిటెడ్ (ఆర్) హోసాపేట పేరుతో కేంద్రప్రభుతం నుంచి సబ్సిడీ రుణాలు అందిస్తామని హామీఇచ్చి 300మందికి పైగా అమాయక మహిళలు, చిన్న దళిత రైతులు, కూరగాయల అమ్మకం దారుల నుంచి రూ.10కోట్లు మోసం చేశారు.

రహదారి బురదమయం



24వ వార్డులో బురదమయంగా మారిన రోడ్డు

సిరుగుప్ప, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డులో ప్రధాన రహదారి నుంచి ఉచ్చీరప్ప తాత ఆలయం వరకు రోడ్డు ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. చినుకుపడితే ఈ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా బురదమయంగా మారినా, నగరసభ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ఈ మార్గంలో వెళ్లాలంటే ఎక్కడ జారిపడతామోనని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా నగరసభ ఇంజనీర్లు ఈ విషయంపై విచారించి తక్షణమే తారు రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ పథకాల నిధులు సద్వినియోగం కావాలి

● అవకతవకలు జరిగితే చర్యలు తప్పవు ● పథకాలు 100 శాతం అర్హులకు అందాలి: కలెక్టర్ మిశ్రా

బళ్లారి సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎస్‌సీఎస్‌పీ(షెడ్యూల్డ్ క్యాస్ట్ ఉప ప్రణాళిక), టీఎస్పీ(ట్రైబ్స్ ఉప ప్రణాళిక)పథకాల కింద వివిధ శాఖలకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించాలని, ఆయా పథకాల్లో 100శాతం విజయాన్ని సాధించాలని అధికారులు ఈ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచించారు. శుక్రవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ హాల్లో కర్ణాటక షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక, గిరిజన ఉప ప్రణాళిక చట్టం కింద 2024-25 నుంచి మార్చి 2025 జూన్ 2025 వరకు ఎస్‌సీఎస్పీ, టీఎస్పీ పథకం పురోగతిపై జరిగిన జిల్లాపర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలు,షెడ్యూల్డ్ తెగల ఉప పథకాలు, గిరిజన ఉప పథకాల కింద వివిధ శాఖలకు విడుదల చేసే నిధులను, వాటి సంబంధిత ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించాలన్నారు. మొదటి త్రైమాసికానికి ఇప్పటికే విడుదల చేసిన గ్రాంట్లతో చేపట్టగల పనుల జాబితాను తయారు చేసి, ఆపై వాటిని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎసీఎస్పీ, టీఎస్పీ పథకాల కింద షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి అన్ని శాఖలు , కార్పొరేషన్లకు నిధులను విడుదల చేసి లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. అయితే మార్చి 2025 నెలకు సంబంధించిన నిధులను ఎందుకు పూర్తిగా వినియోగించలేరు అని సంబంధిత అధికారులను ఆయన ప్రశ్నించారు. గత సంవత్సరం బకాయి ఉన్న మొత్తానికి సంబంధించిన సవరించిన సమాచారాన్ని అందించాలని, బకాయి ఉన్న బిల్లులను పరిష్కరించాలన్నారు. గ్రాంట్లను వినియోగించని శాఖల అధికారులకు నోటీసులు జారీ చేశామన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానందప్ప, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రాజు, ఆహార పౌర సరఫరాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ షకీనా,జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లాపట్టణాభివృద్ధి సెల్ ప్లానింగ్ అధికారి రాఘవేంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, సంచార తెగల మహాసభ డిమాండ్



ఏడీసీ మహ్మద్ జుబేర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

బళ్లారి సిటీ/రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా హొసబండి హర్లాపుర గ్రామంలో బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడికి మరణ శిక్ష విధించాలని కర్ణాటక రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, సంచార తెగల మహాసభ డిమాండ్ చేసింది. షెడ్యూల్డ్ కులాలు,షెడ్యూల్డ్ తెగల సంచార సంస్థల నాయకులు, కార్యదర్శులు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. తరువాత హత్యకు గురైన బాలిక కుటుంబానికి ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని కోరుతూ జిల్లా యంత్రాంగం ద్వారా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వినతి పత్రాన్ని పంపారు. మహాసభ జిల్లాధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ బాలిక తల్లిదండ్రులు జీవనోపాధి కోసం బెంగళూరులోని మాగడి రోడ్డులోని తవరకెరెలో ఇటుక పనికి వెళ్లారు. బాలిక టీవీ చూస్తుండగా లైంగికదాడి చేసి అత్యాచారం చేయడం దారుణమన్నారు. నిందితులకు మరణశిక్ష విధిస్తేనే మరోసారి నేరాలు జరగకుండా ఆపగలమన్నారు. ఈసందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బన్న, ఉపాధ్యక్షుడు బి.రామయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజిని, జిల్లా కోశాధికారి చన్నబసప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా సంయుక్త కార్యదర్శి శైలా సీతారం, ఇతర సంస్థల ఆఫీస్ బేరర్లు, మునిస్వామి, మహేశ్, లక్ష్మణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పయ్యావుల రాధాకృష్ణకు

కన్నీటి వీడ్కోలు

● అంత్యక్రియల్లో పాల్గొన్న అభిమానులు, నాయకులు

బళ్లారి, జూలై 18(ఆంధ్రజ్యోతి): న్యూ శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత పయ్యావుల రాధాకృష్ణ అంత్యక్రియలు బళ్లారిలోని హరిశ్చంద్ర ఘాట్‌లో శుక్రవారం నిర్వహించారు. నగరంలోని సూర్యకాలనీ రాధాకృష్ణ నివాసంలో భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. రాధాకృష్ణ కడచూపునకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వివిధ విద్యాసంస్థల యజమానులు, సేవాసంఘాలతో పాటు బొమ్మనహాళ్ మండలం నుంచి బంధువులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, బొమ్మనహాళ్ మండల రాజకీయ నేత కొత్తపల్లి తిమ్మరాజులు, కొత్తపల్లి మల్లికార్జున, కొత్తపల్లి మహేంద్ర, పయ్యావులు బాబు, పయ్యావులు కుటుంబంతో పాటు అనేక మంది అభిమానులు తరలి వచ్చి రాధాకృష్ణ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. విద్యాదాతగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. బళ్లారి జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొమ్మనహాళ్ చంద్రహస్, రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, బళ్లారి మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, బ్లూమూన్ లిక్కర్స్ ఓనర్ రామిరెడ్డి, ఎస్సీ శోభారాణి, మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు, మేయర్ నందీష్‌బాబు, రాధాకృష్ణ స్నేహితులు, కళాశాల సిబ్బంది, తదితరులు రాధాకృష్ణకు కన్నీటి వీడ్కోలు పలికారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ రాధాకృష్ణ పేద విద్యార్థులు ఎంతో మందికి ఆర్థిక సహాయంతో, పాటు జ్ఞానం ప్రసాదించిన గొప్ప మానవత్వం ఉన్న వ్యక్తి అన్నారు. వారి కుటుంబానికి పార్టీ తరపున, వ్యక్తిగతంగా ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పేద విద్యార్థులకు ఆయన చేసిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయన్నారు.



పయ్యావుల అంతిమయాత్ర

పాముకాటుపై ఆందోళన వద్దు

● సత్వరమే చికిత్సతో సురక్షితం: డాక్టర్ మరియంబి



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మరియంబి

బళ్లారి సిటీ,జూలై 18(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైనప్పుడు ఆందోళన వద్దని, తక్షణమే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియంబి అన్నారు. కాటుకు గురైన వ్యక్తిని ప్రశాంతంగా ఉంచడం ద్వారా, ఉచిత టీకీ కోసం సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లడం ద్వారా ప్రాణాంతక గాయాలను నివారించవచ్చన్నారు. జిల్లాపంచాయతీ, జిల్లాయంత్రాంగం, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా నిఘా విభాగం,మోకా కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం బళ్లారి తాలూకాలోని శివపుర గ్రామంలో నిర్వహించిన పాముకాటుపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాము కాటు వేసినప్పుడు అందరూ భయపడటం సహజం . ఇది ప్రాణాంతకం కావచ్చు. రక్తప్రసరణకు ఆటంకం కలిగించే చేతి గడియారాలు, బ్రాస్‌లెట్‌లు, ఉంగరాలు మొదలైన వాటిని తొలగించాలి. కాటు వేసిన భాగం కదలకూడదు. ఆసుపత్రికి వెళ్ళేటప్పుడు గమనించవలసిన ప్రధాన విషయం వ్యక్తి యొక్క లక్షణాలు తేలడం, రెప్పవేయడం , నాలుక బయటకు లాగడం, మింగడంలో ఇబ్బంది ,శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. గాయపడిన ప్రదేశంలో తీవ్రమైన మంట, నొప్పి లేదా వాపు వ్యాపించడం , గాయం చుట్టూ రంగు మారడం, నడుము దిగువ భాగంలో నొప్పి వంటి లక్షణాలు కూడా అవయవాలను దెబ్బతీసే టాక్సిన్ యొక్క సంకేతాలుగా భావించాలన్నారు. మోకా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భారతి మాట్లాడుతూ పాము కాటుకు గురైనప్పుడు కాటు వేసిన ప్రదేశం చుట్టూ బట్టలు కట్టరాదన్నారు. బ్లేడ్ లేదా కత్తితో గాయాన్ని కోయకూడదని, గాయాన్ని కాల్చడం, నాటుమందులు వాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ కన్సల్టెంట్ డాక్టర్ జబీన్‌తాజ్, డాక్టర్ విశాలాక్షి, తాలూకా హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి శాంతమ్మ, డాక్టర్ ఖుర్షీద్‌బేగం, అజయ్, హెల్త్ ఆఫీసర్ త్రిపున్‌కుమార్, హెల్త్ ఇన్స్‌పెక్టర్ మల్లిగౌడ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి: పీఎస్ఐ



వాహదారులకు అవగాహన కల్పిస్తున్న పీఎస్ఐ పద్మావతి

బళ్లారి సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పీఎస్ఐ పద్మావతి అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్పీ సర్కిల్లో వాహనదారులకు ఆమె అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మీ పై భార్య, పిల్లలు ఆధారపడి ఉన్నారని, వారిని దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదం జరిగినా హెల్మెట్‌తో ప్రాణాపాయం తప్పుతుందన్నారు. ఈసందర్భంగా పీఎస్ఐ మెహబూబ్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. యువకుడి మృతి

రాయచూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముదగల్ పట్టణం పెట్రోల్ బంక్ సమీపంలోని టర్నింగ్‌లో శుక్రవారం ఆటో-బైక్‌ను ఢీ కొట్టిన ప్రమాదంలో బైక్ పై వెళుతున్న యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ యువకుడు తావరగేరాకు చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. బంధువుల ఇంటికి ముదగల్ పట్టణానికి వచ్చిన శరణబసవ తిరుపతి(25) బైక్ పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో కొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. ముదగల్ పట్టణ పోలీసులు సంఘటన స్థఆన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



తిరుపతి(ఫైల్)

బియ్యం పట్టివేత

మడకశిర టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పావగడ నుంచి తుమకూరుకు అక్రమంగా తరలిస్తున్న 455 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకొన్నట్లు విజిలెన్స్ ఎస్ఐ బమాల్ బాషా తెలిపారు. అనుమతులు లేకుండా లారీలో తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బగరు హుకుం సమస్యలు పరిష్కరించాలి

● కర్ణాటక దళిత సంఘర్ష సమితి డిమాండ్



నిరసన తెలుపుతున్న కర్ణాటక దళిత సంఘర్ష సమితి సభ్యులు

బళ్లారి సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న బగరు హుకుం సాగుదారులకు త్వరలో పట్టా ఇవ్వాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి జిల్లా సమన్వయకర్త చిన్న గాదిలింగప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం దళిత సంఘర్ష సమితి నూతన జిల్లా పరిపాలన భవనం వద్ద ఒక రోజు లాంచనప్రాయ నిరసనను నిర్వహించి సిద్దరామయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బగరుహుకుం సాగుదారులు గత కొన్ని దశాబ్దాలుగా ఆ భూమిని సాగు చేస్తూ జీవిస్తున్నారు. ఆ సాగు భూమికి పట్టా మంజూరు చేయడానికి ఫారం నంబర్ 50, 53, 57 ను సమర్పించారని వారు పేర్కొన్నారు కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు దర ఖాస్తులను పరిష్కరించలేదు. సమయం వృథా చేస్తోందన్నారు. నిరసనలో హుసేనప్ప, రాజేశ్వరీ, దుర్గప్ప తల్వార్, ఈరప్ప, తిప్పేస్వామి, లాలప్ప, రాజశేఖర్, సంగనకల్లు విజయ్‌కుమార్, రమేశ్, అంజనేయ, వెంకప్ప,గాదిలింగ,దేవేంద్ర, సిద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

మాదకద్రవ్యాల దుష్ప్రభావంపై జాగృతి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

హోసూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరిస్తూ శూలగిరిలో శుక్రవారం ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి జిల్లా ప్రధాన విద్యాశాఖాధికారి మునిరాజ్ జెండా ఊపారు. శూలగిరి సీఐ సయ్యద్ సల్తాన్, ప్రధానోపాధ్యాయుడు మహదేవన్, టీచర్ సురేశ్ పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు. మద్యం తాగరాదని, మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదంటూ నినాదాలు చేశారు. ఇదే సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ర్యాలీ తిరిగి ప్రభుత్వ పాఠశాల వద్ద ముగిసింది. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు.

పోలీసులు.. రైతుల మధ్య వాగ్వాదం

రాయచూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : భారత్‌మాలా జాతీయ హైవే నిర్మాణానికి సంబంధించి భూస్వాధీనంలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం గోన్వార వద్ద జరిగిన ఆందోళన పోలీసులు, రైతులకు మధ్య వాగ్వాదానికి దారి తీసింది. ఎప్పటికే భూ స్వాధీనం చేసుకున్న అధికారులు తమకు పరిహారం చెల్లించకుండా పనులు మొదలు పెట్టడాన్ని రైతులు అభ్యంతం చెప్పారు. తాము అభ్యంతరాలు తెలిపేందుకు వెళ్లగా ఖాతరు చేయకుండా దౌర్జన్యంగా పంట పొలాలను నాషనం చేసి రోడ్డు నిర్మాణం చేపట్టడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దశలో కాంట్రాక్టర్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఎదురుగుండానే తమ పై దౌర్జన్యం చేశారంటు రైతు సంఘం నాయకుడు శరణప్పస ఉద్బాళ్ ఆరోపించారు.



వాగ్వాదం చేసుకుంటున్న పోలీసులు, రైతులు



వాలీబాల్ విజేతజట్టును అభినందిస్తున్న ప్రముఖులు

వాలీబాల్ పోటీల్లో రాణించిన విద్యార్థులు

హోసూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో బాగలూరు రోడ్డులోని యోగి వేమన పాఠశాలలో నిర్వహించిన ఉత్తరజోన్ షార్ట్ సర్క్యూట్ వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటుకున్నారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, జిల్లా క్రీడా ఇన్‌స్పెక్టర్ వలర్మతి పోటీలను ప్రారంభించారు. అండర్ 14, 17, 19 విభాగాలలో 500మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో యోగివేమన స్కూల్ జట్టు ప్రథమస్థానం సాధించి స్కూల్ రికార్డు నెలకొల్పింది. విజేత విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, పతకాలు, ట్రోఫీలు అందచేసి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మునిరెడ్డి, కోచ్ మాణిక్యవాసగం, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కార్తీక్ తదితరులు విద్యార్థులను ప్రశంసించారు. మరింత ఉన్నతంగా ఆడి జాతీయ స్థాయికి ఎంపిక కావాలన్నారు.

22 వరకు పుస్తక మేళా

హోసూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పాలనా యంత్రాంగం, తమిళనాడు సైన్స్ విభాగం, హోసూరు బీఎంసీ టెక్ సహకారంతో సిప్‌కాట్‌లో ఏర్పాటైన పుస్తకమేళా ఈనెల 22వరకు కొనసాగనుంది. ప్రతిరోజూ ఏదో ఒక సాహిత్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ పాఠకులను ప్రోత్సహిస్తున్నారు. 110 స్టాల్స్ ఏర్పాటు చేయడంతో నిత్యం వందలాదిమంది మేళాను సందర్శిస్తున్నారు. ప్రముఖ కవి కేఎం షరీఫ్ రచించిన బోర్డర్ వార్ అరైజ్, తమిళర్ థాయక ఋక్తి రెండు పుస్తకాలు శుక్రవారం విడుదల చేశారు. తమిళ జాతీయ ఉద్యమ జనరల్ కమిటీ సభ్యుడు సోకిమ్ అధ్యక్షత వహించరు. నగర కార్యదర్శి మురుగ పెరుమాళ్, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు మారిముత్తు పాల్గొని పుస్తకాలను పరిచయం చేశారు. మాజీ ఎమ్మెల్యే మనోహరన్ పుస్తకాలను లాంఛనంగా విడుదల చేశారు. పుస్తకాలను తమిళ అభివృద్ధి మండలి కోశాధికారి కృష్ణన్, అశోక్ లేలాండ్ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, తంగరాజ్, శివకార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో మాజీ ఎమ్మెల్యే మనోహరన్

మహిళలకు రక్షణ కల్పించాలి: ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హోస్పేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడలోని మూడ్బిద్రిలో విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డ ఇద్దరు కళాశాల లెక్చరర్లను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా క్యాంపస్‌లలో లైంగిక వేధింపులు, హింస, విద్యార్థులపై దాడి,అత్యాచారాలను ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ తాలూకా కమిటీ ఆధ్వర్యంలో హోసాపేట తాలూకా డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్‌కు రాష్ట్రపతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగాఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ కళాశాలల్లోల్ల మహిళా విద్యార్థులపై లైంగిక వేధింపుల కేసులు పెరుగుతున్నాయని, దోషులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.